# నీలి వెన్నెల

తాతయ్యకి ఉన్నట్టుండి మెలకువ వచ్చింది. టైము చూసేసరికి నాలుగున్నర. సాధారణంగా ఈమధ్యన ఇంత తెల్లారగట్ట మెలకువ రావడంలేదు. ఏదో ఊహ అతని మనసులోకి రాగానే చిన్న చిరునవ్వు పెదవుల మీదకి వచ్చింది. తెల్లారితే ఆదివారం. వారం రోజులుగా ఎదురుచూసే ఆదివారం.

నిజానికి ఆదివారం అంటే అపురూపంగా భావించేకాలం దాటేపోయింది. ఉద్యోగంలో ఉన్నన్నిరోజులూ ఆదివారమంటే ఎంతో ఉత్సాహం. రిటైరయిపోయి, ఇంట్లోనే కాలక్షేపం అయినప్పుడు అన్నిరోజులూ ఆదివారాలే. కానీ ఈమధ్య రెండేళ్ళుగా ఆదివారం అపురూపమైన రోజుగా మారింది. ఆదివారం అంటే నీలిమ వస్తుంది. వాళ్ళమ్మా నాన్నల చేతులు పట్టుకుని మధ్యన గెంతకుంటూ వచ్చి తాతయ్యని చుట్టేస్తుంది. బామ్మ మెడచుట్టూ చేతులు వేసి గారాలుపోతుంది. నీలిమ ఇంట్లో తిరుగుతుంటే ఇల్లంతా నీలివెన్నెల పరుచుకుంటుంది,

తాతయ్య తలుపు తీసుకుని బయటకొచ్చాడు. చల్లగా, హాయిగా ఉంది. ఆ ముందురోజే పౌర్ణమి. ఆ తెల్లారగట్ట తెల్లగా వెన్నెల నాలుగుదిక్కులా తెరలు దించింది. అక్కడక్కడ పక్షులు సుప్రభాతాలు మొదలుపెట్టాయి. రకరకాల పూలవాసనలు గాలిలో తేలివస్తున్నాయి.

జోళ్ళేసుకుని బయటకొచ్చాడు తాతయ్య. ఆ వీధిలో ఇటూఅటూ పెద్దపెద్ద ఇనుప గేట్లున్న యిళ్ళు మంచులో తడిసి చూడ మనోహరంగా వున్నాయి. ప్రతి యింటి పిట్టగోడకీ మాలతీ లతలు, జాజి తీగలు, కాశీరత్నాలు, మధుమాలతులు అల్లుకుని పూసిన పువ్వులతో

చిన్న గాలికి ఊగుతున్నాయి. రాలిన పున్నాగ పూలు, పారిజాతాలు తోటలోని గులాబీల పరిమళాలతో పోటీపడుతున్నాయి. తాతయ్య పున్నాగ పూలని, పారిజాతాలని ఏరడం మొదలుపెట్టాడు. రాలిన బాదం ఆకులు మూడు చేర్చి, తడిసిన నేలమీద అప్పుడే రాలిన పువ్వులు ఏరి పొట్లం కట్టాడు. తెలతెలవారుతున్న ఆవేళ వీధిలో నడుస్తుంటే ఎంతో బాగుంది – ఒక్కక్షణం మనసులో పశ్చాత్తాపం కలిగింది. ఇంత చక్కటి ప్రకృతిని చూడకుండా, అనుభవించకుండా, వేడెక్కిన పరుపు మీద దొర్లుతూ, దోమల ఘాటు మందు పీలుస్తూ, గరగరమంటూ తిరిగే ఫ్యాను గాలికి శరీరాన్ని వదిలేసి, అదే ఎంతో సుఖమని భ్రమిస్తున్నానే అని బాధ అతనికి కలిగింది.

ఇంటివైపు అడుగులేస్తుంటే జాగింగ్ చేసేవాళ్ళ సందడి మొదలైంది. మిలటరీ బెటాలియన్లు లయబద్ధంగా సాగిపోతున్నారు.

నీలిమ మాటలు గుర్తుకొచ్చి ఆనందం గుండెలంతా నిండింది. ఇంట్లో అడుగు పెడుతూనే పూలు టేబులుమీద పోశాడు.

"ఈ పూలెంత బాగున్నాయి. పారిజాతాలు చూసి ఎన్నాళ్ళయిందో" అంది బామ్మ.

"అది సరేగానీ బయటెంత బాగుందనుకున్నావ్".

"అవును. కాస్త ఓపిక చేసుకుని నాలుగడుగులు వేస్తే హాయిగా ఉంటుంది."

తాతయ్య కాఫీ తాగుతూ ఆలోచనలో పడ్డాడు. ఎప్పుడూ లేనంతగా తను ఎదురుచూస్తున్నాడు. తీరా ఈరోజు వీలుపడడంలేదని అబ్బాయి ఫోను చేస్తే మళ్ళీ వారంరోజులు నీలిమకోసం ఎదురుచూడాలి.

అతని ఆ ఊహ అతనికెంతో నిరుత్సాహం కలిగిస్తోంది. ఏదో నిరాశ.

"ఏమిటలా సీరియస్ ఆలోచన" అంది బామ్మ.

"అబ్బే, ఏం లేదు. వీళ్ళొస్తారు కదా".

"రాత్రి ఫోనుచేసి చెప్పాడుగా."

తాతయ్య గుండె దడదడ –

"ఏమని" గొంతులో ఆత్రం.

"వస్తామని" అప్పుడే వచ్చిన పేపరు తిరగేస్తూ బామ్మ మామూలుగా అంది.

మళ్ళీ తాతయ్య మనసు ఆనందంతో నిండింది.

"హమ్మయ్య".

సుగంధంతో సుడిగాలిలా వచ్చింది నీలిమ. దాని వయసు నాలుగున్నర సంవత్సరాలు. దాని ఊహలకి హద్దుల్లేవు. మాటలకి అదుపు లేదు. పెద్దరికపు మాటల్లో పసితనపు అమాయకత్వం – కళ్ళు తిప్పుతూ కబుర్లు, నడ్డి తిప్పుతూ డ్యాన్సులు, గొంతెత్తి పాటలు, గంతులు, ఆటలూ, – ఇల్లంతా విరగబూసిన పూతోట, బెథోవిన్ ఆర్కెస్ట్రా మధురిమ.

తాతయ్యా 'నీకీరోజు రెండు ఆపరేషన్లు చేస్తా' అంది ఇంట్లోకి వస్తూనే -,

"సరేనమ్మా! నీ ఇష్టం" అన్నాడు తాతయ్య.

"మరి నడూ -" అంది.

"కాస్సేపు ఆగవే - పది నిముషాలు నా కొడుకుతో, కోడలుతో మాట్లాడనీ..." అన్నాడు బతిమాలుతూ.

"అంటే నాన్నతో, అమ్మతోనా... ఓ.కే. పది నిముషాలు కాదు... ట్వంటీ మినిట్స్ అయితే ఇస్తా" అంది.

అది పరుగున వెళ్ళి కొన్ని చీపురు పుల్లలు, ఒక స్కేలు, చిన్న ప్లాస్టిక్ డబ్బా... ఇలా ఏవేవో పోగేసి, "తాతయ్యా రా" అంది.

తాతయ్య నవ్వుతూ మంచంమీద పడుకుని "ఎంతసేపు పడుతుంది డాక్టరుగారూ నా ఆపరేషన్" అన్నాడు.

"టెన్ టు ఫిఫ్టీన్ డేస్" అంది.

"అసలు నాకు జబ్బేమిటే" అనా4్నడ,

"నీకీ చేతిమీద పుట్టుమచ్చ ఉంది కదా! అది లోపల కలిసిపోయింది -" అంటూ పుల్లతో నెమ్మదిగా, బ్లడ్ తీస్తున్నట్లు, స్కేల్‌తో బి.పి. చూస్తున్నట్లు నటించింది.

"నాకు బి.పి. ఎంతుంది"-

"వన్ థౌజండ్" -

"అబ్బా! ఫరవాలేదే" అన్నాడు తాతయ్య.

"ఇంకా నయం. నిన్న వాణీ బామ్మకి ఫైవ్ హండ్రెడ్ వుంది తెలుసా" - అంది కళ్ళు తిప్పుతూ.

"నిజంగానా" అంటూ తాతయ్య ఆశ్చర్యం నటించాడు.

"తాతయ్యా! బ్లడ్ రెడ్‌గా వుంటుంది కదా! ఇప్పుడు నీకు తెల్లగా అయిపోయింది, అదే ప్రాబ్లమ్" అంది.

"ఎందుకంటావు అలాగైంది" - అన్నాడు తాతయ్య అమాయకపు ముఖంపెట్టి.

"నువ్వు పెరుగన్నం ఎక్కువ తింటున్నావేమో" అని, "అందుకే నీకు స్కేల్ ఆపరేషన్ చెయ్యాలి" అంది సీరియస్‌గా ముఖంపెట్టి.

"బి.పి. తగ్గుతుందా?"

"ఓ... స్కేల్‌కి ఒకపక్క హోల్ వుంది కదా! దాన్లోంచి బి.పి. జారిపోతుందిలే - ఫరవాలేదు" అంది.

"ఎంతసేపు పడుతుందంటావు ఆపరేషన్"

"టెన్ డేస్, అయినా ఇప్పుడు ఆపేస్తాను. కాస్సేపు జంగిల్‌బుక్ చూద్దాం" అంటూ మంచంమీంచి దూకింది కిందకి.

"ఇంతకీ ఫీజెంతో చెప్పలేదండి, డాక్టర్‌గారూ" అన్నాడు తాతయ్య నాటకీయంగా.
"టూ రూపీస్" అంది నీలిమ స్టైల్‌గా.
అందరూ గట్టిగా నవ్వారు.
"ఏయ్ నీలిమా! తాత మంచం మీదున్న పుల్లలు అవీ తీసేయ్" అంది వాళ్ళమ్మ.
"ఇంకా ఆపరేషన్ వుందమ్మా" అంది దీర్ఘం తీస్తూ.
"వుంటే మళ్ళీ తీసుకో - అందాకా ప్లాస్టిక్ బ్యాగ్‌లో వేసెయ్యి" అంది.
'సరే' అంటూ అన్నీ బ్యాగ్‌లో వేయడం మొదలుపెట్టింది.
"ఇంతకీ నాకు పత్యం ఏమైనా వుందా? అన్నీ తినచ్చా" అన్నాడు.
"అయ్యో అన్నీ తింటే ఎలా? నువ్వు సబ్‌వే తినకూడదు. కుర్‌కురే తినకూడదు. చిప్స్ తినకూడదు" అంటూ వేళ్ళు లెక్కపెడుతూ ఆగింది.
"రస్కులు తినొచ్చునా" అన్నాడు తాతయ్య నవ్వుతూ.
"ఆ..." అంటూ పైకి చూసి, ఆలోచించి, "కొంచెం తినొచ్చు. అయినా నాకిష్టం లేదుగానీ రస్కులు నువ్వు తినొచ్చులే" అంది.
"అవునుగానీ నీలితల్లీ, ఇవన్నీ నీకెలా తెలుసునే" అన్నాడు తాతయ్య.
"మా అమ్మ నేనేం ఎక్కువగా తినకూడదో చెప్తుంది కదా! నువ్వు ముసలివాడవని అస్సలు తినొద్దని చెప్పా" అది ఒక సోఫా మీంచి మరొకదాని మీదకి దూకుతూ -
ఇంట్లో అందరూ నవ్వుతూనే ఉన్నారు. నీలిమ మాటలకోసం తడుముకోదు.
నీలిమని సరదాగా మాట్లాడిద్దామని వాళ్ళమ్మ "నీలిమా ఇలా రావే" అని పిలిచి, "అసలు నీకేం కూరలిష్టమో చెప్పవే" అంది. వెంటనే చెప్పడం మొదలుపెట్టింది.
"నాకు బెండకాయ కూరిష్టం, అరటికాయ వేపుడిష్టం, ఆలుగడ్డ వేపుడు కూడా యిష్టం. ఆవకాయ ఇష్టం..." అని కాస్సేపాగి పచ్చడేదైనా యిష్టమే" అంది.
"ఇంకా"
ఇంకానా... "పులిహోర యిష్టం, పూరీ యిష్టం, గారెలిష్టం, ఫైవ్‌స్టారిష్టం - చాకోబారిష్టం, అయిస్‌క్రీమిష్టం" అంది.
అందరూ ఆనందంగా నవ్వుతూ నీలిమనే చూస్తున్నారు.
"సినిమాలేం యిష్టం".
"మూలాన్ యిష్టం, జంగిల్‌బుక్ యిష్టం, 'నీమో' యిష్టం" అంది.
"టీవీలో ఏం చూస్తావ్"
"సీరియల్స్ అమ్మతో చూస్తాగానీ, బాబోయ్ ఫైటింగ్‌లు వస్తే అస్సలు చూడను"
"ఏ సీడీ పెడితే అన్నం స్పీడ్‌గా తినేస్తావు చెప్పు"
"అష్టా-చెమ్మా" అంటూ అరిచింది, సోఫాలోంచి దూకింది.
"పెద్దయ్యాక నువ్వేమవుతావే నీలిమా" బామ్మ ముద్దుగా అడిగింది,

"ఫిలిమ్ డైరెక్టర్నవుతా - ప్రొఫెసర్ అవుతా" అంది.

"అదేమిటీ రెండూ ఎలా అవుతావు" అంది.

"నాన్న డైరెక్టర్ కదా! అందుకు డైరెక్టర్ అవుతా" అని ఆగి, "అమ్మ ప్రొఫెసర్ కదా" అందుకు ప్రొఫెసర్నవుతా" అంది.

"మధ్య ఈ డాక్టరేమిటి?" అన్నాడు తాతయ్య.

"డాక్టరూ అవుతా"

"ఇన్నెలా అవుతావు?"

"అటూయిటూ తిరుగుతూ అల్లరి చేయకుండా, కష్టపడి చదువుతే నేను డాక్టరవుతాననీ మా గీతా టీచర్ చెప్పింది"

"మరి చదువుతావా యిప్పట్నించి" అన్నాడు తాతయ్య.

"అయ్యో! తాతయ్యా అప్పుడే కాదూ - నేనింకా అప్పర్‌మాంటే కదా! నాకింకా హోంవర్కే లేదు" అంది గట్టిగా.

"సరే సరే అన్నాలకి రండి - నీలీ నువ్వు ముందుగా తినేస్తావా" అంది బామ్మ టేబులు సర్దేసి

"అమ్మా! విల్ యూ ఫీడ్ మీ" నీలిమ గారంగా అడిగింది.

"పెద్దదానివయ్యావుగా - సొంతంగా తినాలి" అంది వాళ్ళమ్మ.

"అప్పుడే ఎక్కడ పెద్దదాన్నయ్యానూ - నా హ్యాపీ బర్త్‌డే డిసెంబరు వచ్చాక కదా నేను పెద్దదాన్నయ్యేది".

"అయితే ఏం చెయ్యమంటావు?"

"నువ్వు పెట్టమ్మా" వాళ్ళ అమ్మ ఒళ్ళో కూర్చుని గారంగా అడిగింది.

"నాకాకలి వెయ్యదా! నేను తినొద్దా - ఇప్పుడే ఆకలితో నా కడుపులో ఎలుకలు తుర్రు తుర్రు గుర్రుగుర్రు" అంటూ వాళ్ళమ్మ యాక్షన్ చేసింది.

"జెర్రీలు కదూ" అంది నీలిమ నవ్వుతూ.

వాళ్ళమ్మ కూడా నవ్వుతూ నీలిమని ముద్దుపెట్టుకుంది. నీలిమ ఒక్కక్షణం ఆలోచించి -

"నాకొక అయిడియా వచ్చింది" అంది.

"ఏమిటీ"

"కూరన్నం - పప్పన్నం నువ్వు పెట్టేయ్. పెరుగన్నం నాన్న పెడతాడు, ఓ.కే." అంది.

"దొంగపిల్లా - ఏమే నీ తెలివి".

ఇంతలో బామ్మ వచ్చి "నే పెడతానే" అంది.

"బామ్మయితే - పప్పూకూరా, పచ్చడీ, పెరుగూ అన్నీ బామ్మే పెట్టాలి" అంది.

"సరే" అంది బామ్మ ఆనందంగా.

"అయితే ఒక షరతు" నీలిమ కుడిచేతి చూపుడువేలు పైకెత్తింది.

"మళ్ళీ ఏమిటి?" అంది బామ్మ అన్నం కలుపుతూ.

"అయిటమ్‌కి ఒక కథ చొప్పున చెప్పాలి".

"అంటే నాలుగు కథలే"

"అవును".

"అయితే నాదీ ఒక షరతు" అంది బామ్మ.

"ఏమిటీ?"

"నేను మూడు కథలు చెప్తా – నాలుగో కథ అన్నం తినగానే నువ్వు నాకు చెప్పాలి".

"ఓ.కే." అంది నీలిమ.

"సరే రా"

"బామ్మా! రాజు ఏడు చేపలూ కథ వొద్దే, ప్లీజ్" అంది.

దాని ముఖం చూసి బామ్మ పగలబడి నవ్వింది.

"సరే – నేనేం కథలు చెప్పాలో నువ్వే చెప్పు" అంది.

"సరే! మూడెద్దులు – సింహం – ఒకటి. ముసలిపులి – కంకణం రెండు, కుందేలు – కప్ప – మూడు" అంది.

నీమిల నోట్లో ముద్దపెడుతూ బామ్మ కథలు మొదలుపెట్టింది. నీలిమ ఆశ్చర్యంగా, ఆసక్తిగా కథలు వింటూ, ముద్దలు తింటోంది. పెరుగులోకి రాగానే బామ్మ గుర్తుచేసింది – "నువ్వు నాకు కథ చెప్పాలి" అంటూ.

"చెప్తాను. నాకే భయమా – బామ్మా, నేను నువ్వు చెప్పిన కథల్లోంచే ఒకటి చెప్తాననుకుంటున్నావు కదూ" అంది.

"అవునూ" అంది బామ్మ.

"కాదు. నేను సొంతంగా ఒక కథ చెప్తాను" అంది నీలిమ.

"చెప్పు – చెప్పు చెప్పు" అంటూ చివరి ముద్ద నోట్లో పెట్టేసి, మూతి కడిగేసింది. నీలిమ న్యాప్‌కిన్‌తో శుభ్రంగా చేతులు, మూతీ తుడిచేసుకుంది.

"అయితే ఒక షరతు" అంది బామ్మ.

"మళ్ళీ ఏమిటి" అంది నీలిమ.

"నేను అన్నం తింటూ నీ కథ వింటాను" అంది.

"ఓ.కే. అయితే ఒక షరతు"

"ఏమిటీ?"

"నువ్వు నే చెప్పే కథ వింటూ ఊ... ఊ... అంటూ అన్నం తినాలి" అంది

నీలిమ.

"ఓ.కే. నో ప్రాబ్లమ్" అంది బామ్మ.

నీలిమ కథ మొదలుపెట్టడానికి ఆలోచనలో పడింది.

"అనగనగా – ఒక ఊళ్ళో ఒకమ్మాయుంది. ఆ అమ్మాయి అంటే లిటిల్ గళ్ అన్నమాట. ఆ అమ్మాయి పేరేమిటో నీకు తెలుసా" అని అడిగింది నీలిమ, మెరిసే కళ్ళతో బామ్మవైపు చూస్తూ.

బామ్మ కాస్త ఆలోచించినట్లు అభినయించి – రెండుమూడు పేర్లు చెప్పి, చివరగా – "నీలిమా" అంది హుషారుగా.

"ఆ... నీలిమ పొద్దున్నే లేచి, బ్రష్ చేసుకుని, స్నానంచేసి, బట్టలేసుకుని, జడలు వేయించుకుని" అని ఆగింది.

"పాలు తాగి" అంది బామ్మ.

"పాలు కాదు. బోర్నవిటా" గట్టిగా దీర్ఘం తీసింది.

"సరే సరే – చెప్పు"

"స్కూలుకెళ్ళింది. బుక్స్ తీసుకుని.."

'బుక్స్ అంటే ఏం బుక్స్?"

"ఉత్తినే చెప్పాను. కథ కదా – అందుకని" అని మళ్ళీ ఆలోచించి మొదలుపెట్టింది.

"నీలిమ క్లాసు రూంలోకి వెళ్ళింది. కానీ అక్కడొక్కరూ లేరు. బెంచీలన్నీ ఖాళీ – టీచర్ చైర్ ఖాళీ – నీలిమ అటూ యిటూ చూసింది. అంత పెద్ద క్లాస్‌రూంలో తనొక్కత్తే – భయమేసింది. ఇంతలో పైనుంచి ఒక కాగితం పడింది. నీలిమ కంగారులో వెళ్ళి ఆ పేపరు విప్పింది. అందులో ఏమని వ్రాసిందో తెలుసా –"

బామ్మ తెలీదని తల అడ్డంగా ఊపింది.

"ఇంకా ఎవరూ రాలేదు" నీలిమ గొంతు లావుగా చేసి, భయపెట్టేవిధంగా చెప్పింది –

నీలిమ చెప్పే కథ అందరూ ఆశ్చర్యంగా, ఆసక్తిగా ఉంటున్నారు – ఆ తర్వాతేం జరిగిందే అన్నాడు వాళ్ళ నాన్న సస్పెన్స్ భరించలేక.

"అంతే కథ – అయిపోయింది" అంటూ నీలిమ వాళ్ళమ్మ వెనక్కి వెళ్ళి సిగ్గుపడుతూ దాక్కుంది.

అందరూ అయిదు నిముషాలు ఆక్కుండా నవ్వుతూనే ఉన్నారు.

ఆదివారం మూడొంతులు గడిచిపోయింది. తాతయ్య మనసు చిన్నబోవడం మొదలైంది. ఈ సందడంతా వెళ్ళిపోయి, ఇల్లంతా నిశ్శబ్దం ఆవరిస్తే ఏమిటి చేయడం?

పిల్లలు పార్కుకెళ్ళి గంట కాలక్షేపం చేసి వచ్చారు.

"తాతయ్యా! నీ ఆపరేషన్ సగంలో ఆగేపోయింది"

"మరైతే ప్రమాదమేమైనా ఉందిటే నీలిమా"

"అబ్బే! అదేం లేదు. మన ఆపరేషన్ మనిష్టం. ఎప్పుడైనా చేయచ్చు. ఎప్పుడైనా ఆపేయచ్చు."

"నీలిమా, మరి ఆపరేషన్ ఫీజ్ తీసుకున్నావా?" అన్నాడు వాళ్ళ నాన్న వెళ్ళడానికి బయలుదేరుతూ.

"టూ రూపీస్ – కానీ ముసలివాడు ఏం ఇస్తాడు? అయినా మన తాతయ్యే కదా!" అంది ఉదారంగా.

తాతయ్య ఫ్రిజ్‌లోంచి రెండు ఫైవ్‌స్టార్ చాక్లెట్లు తీసి నీలిమకిచ్చాడు – "ఇదేనే ఆపరేషన్ ఫీజు".

"అమ్మ తాతయ్యా! పొద్దుటినుంచీ ఇవ్వకుండా దాచావా"

"మరి పని పూర్తయినాక కదా ఫీజు" అన్నాడు.

"వచ్చే ఆదివారం – అపరేషన్ పూర్తి చేసేస్తాన్లే. ఎందుకైనా మంచిది, మరో రెండు చాక్లెట్లు తెప్పించి ఉంచు."

ఒక్కసారి ఇల్లంతా నిశ్శబ్దం ఆవరించింది. తాతయ్యకి మళ్ళీ వచ్చే ఆదివారం కోసం నిరీక్షణ మొదలైంది.